క్లుప్తంగా

బాధిత కుటుంబానికి బలసాని భరోసా



గుంటూరు రూరల్: ప్రతి కుటుంబానికి వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం వట్టిచెరుకూరు మండలం కోవెలమూడిలో ఇటీవల ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోయి కట్టుబట్టలతో రోడ్డున పడ్డ బుర్రా బుజ్జిబాబు కుటుంబాన్ని బలసాని పరామర్శించారు.

నేటి నుంచి అగ్నిమాపక వారోత్సవాలు

పొన్నూరు: రాష్ట్ర విపత్తు స్పందన, అగ్ని మాపక సేవల శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీ నుంచి 20 వరకు అగ్ని మాపక వారోత్సవాలు నిర్వహించనున్నట్లు అగ్నిమాపక అధికారి ప్రసాదరావు తెలిపారు. సోమవారం ఉదయం పట్టణంలోని అగ్నిమాపక కేంద్రంలో ఉదయం 10 గంటలకు అగ్ని ప్రమాదాలలో ప్రాణాలర్పించిన సిబ్బందికి నివాళులర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఏడు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో పాఠశాలలు, వైద్యశాలలు, హోటళ్ల తదితర ప్రాంతాల్లో ప్రజలు, విద్యార్థులకు అగ్నిమాపక శాఖ సేవలపై అవగాహన కల్పించనున్నట్లు వెల్లడించారు.

ముగిసిన కృపా మహాసభలు



గుంటూరు రూరల్: నాలుగు రోజులుగా నల్లపాడు రోడ్డు హౌసింగ్‌బోర్డ్ కాలనీ ఎదురుగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ కృపా మహాసభలు ఆదివారంతో ముగిశాయి. ఆదివారం ప్రత్యేక ప్రార్థనలను బ్రదర్ మ్యాథ్యూస్ ప్రార్థనలు చేసి ప్రారంభించారు. కృపా మినిస్ట్రీస్ సండే స్కూల్ చిన్నారులు క్రీస్తుని స్తుతి గీతాలను ఆలపించారు. అదేవిధంగా కీర్తన గ్రంథం 119వ అధ్యాయంలోని 176 వచనాలను చూడకుండా చెప్పిన చిన్నారులను దైవజనులు బ్రదర్ మాథ్యూస్, దైవ సేవకురాలు బుజ్జి అభినందించి వారికి మెమొంటోను ప్రజెంట్ చేశారు. సభల్లో పాల్గొన్న క్రీస్తుని భక్తులకు మహిమ కలగాలని దేవుని ఆశీర్వాదాలు కలగాలని ప్రార్థనలు చేశారు. పాస్టర్ జాకబ్, పాస్టర్ డేవిడ్‌రాజు వాక్యోపదేశం చేశారు.

అనుమర్లపూడి ఆలయంలో చోరీ

పెదకాకాని: చవళ్లమ్మ అమ్మవారి ఆలయంలో చోరీ ఘటన ఆదివారం వెలుగుచూసింది. మండలంలోని అనుమర్లపూడి గ్రామ శివార్లలో ఉన్న చవళ్లమ్మ అమ్మవారి ఆలయం పూజారి రాంబాబు ఎప్పటి మాదిరిగానే శనివారం పూజా కైంకర్యాలు ముగించుకుని ఆలయానికి తాళాలు వేశాడు. గుర్తు తెలియని దొంగలు ఆదివారం తెల్లవారుజామున ఆలయ తాళాలు పగులగొట్టి ఆలయంలో ఉన్న బీరువాలో శఠగోపం, అమ్మవారి చెవి పోగులు, ముక్కు పుడక, రెండు మంగళసూత్రాలు తీసుకుని వెళ్లిపోయారు. అపహరణకు గురైన వస్తువుల విలువ సుమారు లక్ష రూపాయలు ఉంటుందని గుర్తించారు. ఎప్పటి మాదిరిగానే పూజలు చేసేందుకు వెళ్లిన పూజారి ఆలయంలో చోరీ చేసినట్లు గుర్తించి స్థానికుల ద్వారా పోలీసులకు సమాచారం అందజేశారు. పూజారి రాంబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెదకాకాని సీఐ టీపీ నారాయణస్వామి తెలిపారు.

ఎడారి ఓడ పుస్తకావిష్కరణ



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం శ్రీపద్మావతి కల్యాణ వేదికపై ఆదివారం సహజ సాహితీ వ్యవస్థాపకులు(చీరాల) వడలి రాధాకృష్ణ రచించిన ఎడారి ఓడ(వజ్రోత్సవ జ్ఞాపిక) పుస్తకావిష్కరణ మహోత్సవ సభ నిర్వహించారు. ఆలయ పాలకమండలి అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. కవి, రచయిత ఎం.ప్రభాకర్(అమరావతి) ఆవిష్కరించగా, సనాతన సారధి సంస్థ అధ్యక్షుడు సనాతన బాలరాజు(మహబూబ్‌నగర్) తొలి ప్రతి స్వీకరించారు. సామాజిక కార్యకర్త పలకలూరి శివరావు, సంఘ సేవకులు బత్తుల మురళీ, రచయిత గొర్రెపాటి శ్రీను, డాక్టర్ పెరుగుపల్లి బలరాం, ఎస్.సన్యాసిరావు, తెలుగు భాష వికాస సమితి నుంచి డాక్టర్ డీఆర్‌బీ ప్రసాద్, అమ్మవడి అధ్యక్షులు ఎ.శ్రీనివాసరావు, విశాల సాహితీ సమితి అధ్యక్షులు డాక్టర్ జెల్ది విద్యాధరరావు(హైదరాబాద్) పాల్గొన్నారు.

జొన్న రైతులను ఆదుకోవాలి

తెనాలి: తెనాలి ప్రాంతంలో ఆదివారం కురిసిన వడగళ్ల వాన కారణంగా నష్టపోయిన జొన్న, మొక్కజొన్న రైతులని ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి కోరారు. ఇప్పటికే రెండు పర్యాయాల వర్షం కారణంగా జొన్న రైతులు నష్టపోయారని తెలిపారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు పెట్టి నాణ్యత ప్రమాణాలను లెక్కించకుండా రైతుల వద్ద ఉన్న ప్రతీ గింజను మద్దతు ధరకు కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

భూ క్రమబద్ధీకరణ

ప్రకటనలకే పరిమితం

- ఆ పథకంపై కొరవడిన ప్రచారం
- పట్టించుకోని అధికారులు.. పేదలకు తప్పని పాట్లు

పొన్నూరు: అభ్యంతరం లేని చోట ఇళ్లుంటే క్రమబద్ధీకరణ చేసుకునేందుకు ప్రభుత్వం కల్పించిన విధానం ద్వారా నిరు పేదలకు లబ్ధి చేకూరే అవకాశాలు పొన్నూరులో కనిపించడం లేదు. ఆక్రమణ స్థలాల క్రమబద్ధీకరణపై ప్రజల్లో అవగాహన కలిగించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు విమర్శలున్నాయి. స్థలాల విలువ పెరిగినప్పటికీ 150 గజాల వరకు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తున్నందున పేదలకు ఇదో మంచి అవకాశం, జీఓ 30తో అందుబాటులోకి వచ్చిన ఈ పథకంపై సరైన ప్రచారం లేక పేదలకు తెలీటం లేదు. ప్రభుత్వ స్థలాల్లో పక్కాగృహాలను నిర్మించుకున్న పేదలు పట్టాల కోసం ఏళ్ల తరబడి అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడంలేదన్న ఆరోపణలు ఉన్నాయి.

కాసులిస్తేనే పనులయ్యే తరుణంలో..

కాసులిస్తేనే పనులు జరిగే పరిస్థితులు.. ప్రస్తుతం నెలకొన్న తరుణంలో ఉచితంగా భూములు క్రమబద్ధీకరణ సాధ్యమయ్యే పనేనా అనే సందేహాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. ఈ పథకం అమలుపై ప్రజల్లో పూర్తిస్థాయిలో అవగాహన కొరవడింది. పేదలకు ప్రభుత్వం అందిస్తున్న అవకాశం అంతనంత దూరంలోనే ఉండిపోతోంది. పొన్నూరు మండలంలో ఈ పథకానికి సంబంధించి ఇప్పటికీ ఒక్క దరఖాస్తు కూడా రాలేదని రెవెన్యూ అధికారులు పేర్కొంటున్నారు.



పొన్నూరు తహసీల్దార్ కార్యాలయం

విస్తీర్ణం గజాల్లో	చెల్లించాల్సింది	రిజిస్ట్రేషన్ చార్జీలు
150(లోపు)	ఉచితం	ఉచితం
151-300	విలువలో 15శాతం	50 శాతం
301-450	విలువలో 100శాతం	50శాతం

ఎవరెవరు అర్హులంటే?

అర్హులు మీ సేవ, వార్డు, గ్రామ సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. గుర్తింపునకు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఓటరు కార్డు, తదితర ఆధారాలు, స్థలం సంబంధిత పత్రాలు, ఆస్తిపన్ను, నీటి పన్ను, విద్యుత్ బిల్లు తదితరాలు ఆన్‌లైనులో నమోదు చేయాలి. ఆక్రమణదారులిచ్చిన పత్రాల ఆధారంగా సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. ఎంత విస్తీర్ణంలో ఉన్నారు.. తెల్ల రేషన్ కార్డు ఉందా, వార్షిక ఆదాయం ఎంత, వ్యవసాయం.. వ్యవసాయేతర భూములు కలిగి ఉన్నారా, పరిశీలించి క్రమబద్ధీకరణకు సిఫార్సు చేస్తారు. 2019 అక్టోబర్ 15వ తేదీకి ముందు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకుని ఇళ్లు నిర్మించుకుని ఉంటే అలాంటి వారిని అర్హులుగా గుర్తిస్తారు. ఈ ఏడాది డిసెంబరు 31 వరకు అవకాశం ఉన్నా, చివరి నిమిషం వరకు వేచి చూడకుండా అర్హులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ఉన్నతాధికారులు సూచిస్తున్నారు.

బీపీ మండల్‌కు ఘన నివాళి

గుంటూరు రూరల్: వెనుకబడిన వర్గాల ఆశాజ్యోతి, బిహార్ రాష్ట్ర వెనుకబడిన తరగతుల రెండో ముఖ్యమంత్రి దివంగత బిందేశ్వరి ప్రసాద్ వర్ధంతిని మండల్ సేన రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమరావతి రోడ్డు చిల్డ్రన్ సెంటర్‌లో బీపీ మండల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డాక్టర్ ఆల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మండల్ చేసిన సిఫారసులను ఆయా ప్రాంతాల నాయకులు ఇంకా పూర్తిగా అమలు చేయడం లేదని, దీనివల్ల వెనుకబడిన తరగతుల ప్రజానీకానికి తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మండల సిఫారసులు నెరవేరాలంటే దేశవ్యాప్తంగా ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో కుల జనగణన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. బీసీ ప్రతినిధి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు సీనియర్ న్యాయవాది వై.కోటేశ్వరరావు మాట్లాడుతూ దామాషా ప్రాతిపదికన బీసీలకు రాజ్యాంగ హక్కులతో పాటు అన్ని రకాల హక్కులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బి.వీరస్వామి, దాసరి శివకుమార్, ఉగ్గం సాంబశివరావు, సిహెచ్ వాసు, సుబ్రహ్మణ్యం, శాఖమూరి సాంబశివరావు, వి.రాజశేఖర్ పాల్గొని మండల విగ్రహం వద్ద ఘనంగా నివాళులర్పించారు.

బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో

గుంటూరు రూరల్: ఓబీసీ రిజర్వేషన్ల పితామహుడు, మండల్ కమిషన్ చైర్మన్ మాజీ ముఖ్యమంత్రి బిందేశ్వర ప్రసాద్ మండల్ వర్ధంతి సందర్భంగా ఆదివారం అమరావతి రోడ్డులోని మండల్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర యువజన అధ్యక్షులు కుమ్మర క్రాంతికుమార్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కోలా అశోక్, రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి కొల్లూరి హనుమంతరావు పాల్గొన్నారు.



బీపీ మండల్ విగ్రహం వద్ద పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న బీసీ సంఘాల నేతలు



బీపీ మండల్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న బీసీ నాయకులు

ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటిన వివేకా



పొన్నూరు: పట్టణంలోని వివేకా జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో 467 మార్కులతో సాదెళ్ల కృష్ణసాయి ప్రథమ స్థానంలో నిలిచింది. సీనియర్ ఇంటర్ ఫలితాలలో జి.దుర్గా ప్రసాద్, షేక్ కబీర్ ఖాన్ 988 మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరంలో 440కు పైగా మార్కులతో 67 మంది విద్యార్థులు, సీనియర్ ఇంటర్‌లో 900కు పై మార్కులతో 61 మంది విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచారు. ఈ సందర్భంగా ఆదివారం కళాశాల ప్రాంగణంలో అభినందన సభలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్, ఇంటర్మీడియెట్ ఆర్ఐఓ జుబేర్, డీఓ యాసిన్‌బాబా పాల్గొని విద్యార్థులను, తల్లిదండ్రులను సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ యు.సుకుమార్ బాబు, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, డీన్ బోసు పాల్గొన్నారు.

ఈదురుగాలులు, వడగళ్ల వాన

- అకాల వర్షంతో రైతులకు నష్టం
- విరిగిపడిన విద్యుత్ స్తంభాలు, చెట్లు
- శలపాడులో కూలిన చంద్రశేఖరస్వామి ఆలయ ధ్వజస్తంభం

చేబ్రోలు: చేబ్రోలు మండలంలో అకాల వర్షం, ఈదురుగాలులు బీభత్సంతో ఆదివారం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం ఎండ తీవ్రత నుంచి సాయంత్రం ఒక్కసారిగా వాతవరణంలో మార్పులతో బలమైన ఈదురుగాలులు, భారీ వర్షంతో ప్రజానీకం తీవ్ర అవస్థలు పడ్డారు. మండలంలోని పలు చోట్ల విద్యుత్ స్తంభాలు, చెట్లు విరిగి పడ్డాయి. పొలాల్లోని తెల్లజొన్న, మొక్కజొన్న పంటలు ఆకస్మికంగా కురిసిన గాలులు, వర్షానికి ఓదెల మీద ఉన్న పంట తడిసి పోయింది. కోతకు వచ్చిన పైర్లు గాలులకు నేలవాలింది.

శలపాడులో నేలకూలిన పురాతన ధ్వజస్తంభం

మండల పరిధిలోని శలపాడులో ఈదురుగాలులు, భారీ వర్షానికి ఆలయం ముందు ఉన్న ధ్వజ స్తంభం నేలకూడిపోయింది. ఖ్యాతి గాంచిన స్థానిక చంద్రశేఖర స్వామి దేవస్థానం ఎదురుగా ఉన్న ధ్వజ స్తంభం బలమైన ఈదురుగాలులకు దిమ్మె వరకు విరిగి కిందపడిపోయింది.

విరిగిపడిన చెట్లు, విద్యుత్ స్తంభాలు

చేబ్రోలులోని మెయిన్‌రోడ్డు, నందమూరి నగర్, కొత్తరెడ్డిపాలెం, నారాకోడూరు తదితర ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సాయంత్రం నుంచి రాత్రి వరకు కరెంటు లేకపోవటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రెడ్డిపాలెం, చేబ్రోలు, వడ్లమూడి గ్రామాల్లో తాటిచెట్లు, పెద్ద పెద్ద చెట్లు విరిగిపడ్డాయి. కొమ్మలు విరిగి విద్యుత్ తీగలు, స్తంభాల మీద పడ్డాయి.



చేబ్రోలు మండలం శలపాడులోని చంద్రశేఖర స్వామి దేవస్థానం కూలిన ధ్వజస్తంభం

పండ్ల తోటలకు తీవ్ర నష్టం

మండల పరిధిలోని కొత్తరెడ్డిపాలెం, శలపాడు, వడ్లమూడి, శేకూరు గ్రామాల్లోని మామిడి, సపోటా తోటలకు తీవ్ర నష్టం కలిగింది. ఈ ఏడాది పూత, పిందె తక్కువ కావటంతో మామిడి రైతులు డీలా పడ్డారు. అరకొరగా ఉన్న మామిడి పిందె, కాయ ఈదురుగాలులకు రాలిపోవటంతో పూర్తిగా నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుండవరం, గొడవర్రు, వేజండ్ల, నారాకోడూరు, సుద్దపల్లి, శలపాడు గ్రామాల్లో మిర్చి రైతులు కల్లాల్లో ఆరబోసిన మిర్చిని టార్పాలిన్ పట్టాలు వేసి పంట తడవకుండా జాగ్రత్తలు పడ్డారు. అయినప్పటికి కొంత మేర తడిచినట్లు రైతులు చెబుతున్నారు. కోత మీద ఉన్న మిర్చికి ప్రస్తుత వర్షం, గాలులు నష్టాన్ని కలిగిస్తాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. చేబ్రోలు, నారాకోడూరు, శలపాడు తదితర గ్రామాల్లోని దొండ, కాకర, బీర పందిరి తోటలు ఈదురుగాలులు, వర్షానికి కూలిపోయాయి. లక్షలాదిరూపాయిల వ్యయంతో నిర్మించిన కూరగాయ తోటల పందిళ్లు పడిపోవటంతో కూరగాయ రైతులు తీవ్రంగా నష్టపోయారు.



చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెంలో కూలిన తాడిచెట్టు



ఈదురుగాలులకు కూలిపోయిన దొండ పందిరి

పిన్ పాయింట్ ప్రకారం పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరంలో మెరుగైన పారిశుద్ధ్యం కోసం శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులు నిర్దేశిత సమయంలో విధులకు హాజరై పారిశుద్ధ్య పనులను పిన్ పాయింట్‌గా పర్యవేక్షణ చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. ఏటీ అగ్రహారం, చుట్టుగుంట, కేవీపీ కాలనీ, లాలుపురం రోడ్డు, అరండల్ పేట, శంకర్ విలాస్ తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను ఆదివారం పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ ఇప్పటికే నగరంలో పర్యవేక్షణ సౌలభ్యం కోసం శానిటరీ డివిజన్ల పెంపు చేసి, పారిశుద్ధ్య పనులకు అవసరమైన సామగ్రిని అందించామన్నారు. కార్మికులను డివిజన్ల వారీగా రేషనలైజేషన్ చేశామని, అయినప్పటికీ క్షేత్ర స్థాయిలో పారిశుద్ధ్య పనుల్లో మెరుగుదల లేక ప్రజల నుంచి పలు ఫిర్యాదులు అందుతున్నాయని హెచ్చరించారు. రోడ్డు మార్జిన్లలో గార్బేజ్ నిల్వలు పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు ట్రాక్టర్ ద్వారా డంపింగ్ యార్డునకు తరలించాలని కోరారు. అదే విధంగా ప్రజలు రోడ్లపై వ్యర్థాలను వేయకుండా పర్యవేక్షణ చేయాలని, రోడ్లపై వ్యర్థాలు ఎవరు వేస్తున్నది నిఘా పెట్టాలని ప్రజారోగ్యధికారులను ఆదేశించారు. నగరంలో అనధికార జంతువధ నిషేధమని, ఎవరైనా మాంసం దుకాణం పెట్టాలంటే నగర పాలక సంస్థ నుంచి అవసరమైన అనుమతులు తీసుకోవాలని, అనుమతి లేకుండా దుకాణాలు పెడితే వారి దుకాణాలు సీజ్ చేయాలని ప్రజారోగ్యాధికారులను ఆదేశించారు.



పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

వృద్ధులు, దివ్యాంగులకు బియ్యం పంపిణీ

నగరంపాలెం: సమాజంలో ఒంటరిగా జీవించే వయో వృద్ధులు, దివ్యాంగులను ఆదరించాలని శ్రీహనుమాన్ ఆదర్శ సేవా సమితి అధ్యక్షుడు మామిడి మురళీకృష్ణ అన్నారు. కొత్తపేటలోని సమితి కార్యాలయంలో ప్రతి నెల రెండో ఆదివారంలో భాగంగా వయోవృద్ధులు, దివ్యాంగులకు బియ్యం, 11 రకాల నిత్యావసర వస్తువుల కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ సభ్యుల ఆదరణ కరువై, వృద్ధాప్యంతో జీవనం పోరాటం చేస్తున్నారని అన్నారు. అటువంటి వారికి సహాయ, సహకారాలు అందించాలని ఆయన దాతలను కోరారు. దాతల సహకారాలతో మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో జనసేన 18వ డివిజన్ అధ్యక్షుడు శానం రమేష్, సమితి కార్యదర్శి మాదాల ప్రకాష్, కోశాధికారి ఎస్‌వీ.రమణ, బియ్యం కమిటి చైర్మన్ పోలేపల్లి వెంకటసుబ్రమణ్యం, కమిటీ సభ్యులు మామిడి వెంకటశ్రావణ్, పోలేపల్లి లహరి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలి

ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి

పెదకాకాని: వైఎస్సార్ సీపీ అభ్యున్నతే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి సూచించారు. మండలానికి చెందిన తాడిబోయిన వేణుగోపాలరావు, బీసీ విభాగం గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఆదివారం రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డిని పెదకాకానిలోని పార్టీ కార్యాలయంలో కలసి మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఎంపీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా బీసీ సంఘాలతో మమేకమై పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. పార్టీ అభివృద్ధికి కృషి చేసిన ప్రతి ఒక్క కార్యకర్తకు వైఎస్సార్ సీపీలో తప్పక గుర్తింపు లభిస్తుందన్నారు. సంబంధిత నాయకులతో కలసి పార్టీ అప్పగించిన పదవులను బాధ్యతతో నిర్వహించాలని కోరారు. వేణుగోపాలరావు మాట్లాడుతూ పార్టీ గుర్తించి పదవి ఇవ్వడం నా బాధ్యతను మరింత పెంచిందన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి గోళ్ల స్వరూపరాణి, పార్టీ నాయకులు వుయ్యూరు సతీష్‌రెడ్డి, గోళ్ల శ్యాంముఖర్జీబాబు, రవికిషోర్‌రెడ్డి, అవినాష్, సురేంద్ర, దారం శ్రీనివాసు, ఆవుల గోపిరాజు పెనుమాల అరుణ్ పాల్గొన్నారు.



ఎంపీ ఆళ్లకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పార్టీ నాయకులు

సామాజిక పరివర్తనా శిఖరం కర్పూరీ ఠాకూర్

గుంటూరు రూరల్: మండల కమిషన్ చైర్మన్‌గా దేశంలోని వెనుకబడిన ప్రజలకు 27శాతం రిజర్వేషన్ల అమలుకు కృషి చేసిన ఘనత కర్పూరి ఠాగూర్ దేనని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బి.రామాంజనేయులు కొనియాడారు. జన నాయక్ కర్పూరి ఠాకూర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అమరావతి రోడ్డు ఐడీ హాస్పిటల్ ఎదురు కర్పూరి ఠాకూర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల కమిషన్ సిఫార్సులను అమలుపరచడానికి కేంద్ర ప్రభుత్వంపై ఢిల్లీ స్థాయిలో పెద్ద ఎత్తున ఉద్యమం చేసిన పోరాటయోధుడని చెప్పారు. తూర్పు ఎమ్మెల్యే షేక్ మహమ్మద్ నజీర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్లో అత్యధిక నిధులు కేటాయించడంతోపాటు అనేక కార్పొరేషన్ల ద్వారా చేతివృత్తుల వారికి పూర్వవైభవం తీసుకొస్తున్నారని తెలిపారు. విగ్రహ కమిటీ చైర్మన్ పీపీ రమణయ్య మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, నగర ఇన్‌చార్జి మేయర్ షేక్ సజీల, టీడీపీ నేత కందుకూరి వెంకట్, విగ్రహ కమిటీ కో చైర్మన్ సాంబశివరావు, కన్వీనర్ డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు, కోశాధికారి ఎం.బాలతాత, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు, డాక్టర్ గద్దం వేణుగోపాల్, డాక్టర్ నిమ్మల శేషయ్య, బీసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు గుంటుపల్లి శివపూర్ణయ్య, పెమ్మసాని రవి, స్థానిక కార్పొరేటర్ నూకవరపు బాలాజీ పాల్గొన్నారు.



విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రామాంజనేయులు, నజీర్ అహ్మద్ తదితరులు

ఘనంగా అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

పొన్నూరు: అంబేడ్కర్ విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ కాలనీలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కవి డాక్టర్. కత్తి పద్మారావు పాల్గొని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ కాలనీలో మరో విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. అంబేడ్కర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని యువత ముందుకుసాగాలని అన్నారు. అనంతరం కమిటీ సభ్యులు పద్మారావును ఘనంగా సత్కరించారు. అనంతరం కత్తి పద్మారావు, అతిథులను ఘనంగా సన్మానించారు. సభకు న్యాయవాది మానవ హక్కుల వేదిక కన్వీనర్ శ్రీనివాసరాయలు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో మాల మహాసభ వ్యవస్థాపక అధ్యక్షులు మల్లెల వెంకటరావు, కూచిపూడి నెహ్రూబాబు, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ నల్లమోతు రూత్ రాణి, దొడ్డ విజయేంద్ర, ఎద్దు రత్నరాజు, పొందుగల అనిల్ బాబు, గురిందపల్లి క్రాంతి కిరణ్ పాల్గొన్నారు.



కత్తి పద్మారావును సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

ఘనంగా అంబేడ్కర్ జయంతి ఉత్సవాలు

పొన్నూరు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ పాల్గొని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పీపుల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ప్రధాన కార్యదర్శి ఎ.శామ్యూల్ రాజ్, సన్నీ పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్య శిబిరానికి విశేష స్పందన

గుంటూరు రూరల్: గోరంట్ల ఇన్నర్ రింగ్‌రోడ్డులోని శ్రీ వేంకటేశ్వర ఆయుర్వేదిక్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఆదివారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాష్యం విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆయుర్వేదం మన భారతదేశ వైద్యమని చెప్పారు. ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా అన్ని వయస్సులవారు ఈ వైద్యాన్ని వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు. ఐఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్ మేనేజింగ్ డైరెక్టర్ ఈదా సాంబిరెడ్డి మాట్లాడుతూ వంద పడకలతో ఆయుర్వేద వైద్యశాలను ఏర్పాటు చేసిన ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ కొండా వెంకటేశ్వర్లును అభినందించారు. కేరళ వెళ్లాల్సిన అవసరం లేకుండా గుంటూరులోనే అక్కడ అందించే అన్ని రకాల వైద్య సేవలు ఇక్కడ అందించటం సంతోషకరమన్నారు. యోగా గురువు భైసు మల్లికార్జునరావు మాట్లాడుతూ మనిషి ఆరోగ్యంగా ఉండటానికి కావాల్సిన సంపూర్ణ వైద్య విధానం ఆయుర్వేద వైద్యమని తెలిపారు. కార్యక్రమంలో 300 మందికి పైగా ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ భానుకశ్యప్, డాక్టర్ రాహుల్‌చంద్ర, డాక్టర్ మానిక, మేనేజర్ మల్లేశ్వరి, వెంకటేష్ పాల్గొన్నారు.

నేత్ర సమస్యలపై శ్రద్ధ అవసరం



లక్ష్మీపురం: నేత్రాల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని నేత్ర వైద్యనిపుణులు శ్రావణి లక్ష్మి అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఆరోగ్య సభ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నేత్రలపై నిర్లక్ష్యంతో చూపు కోల్పోయిన లేదా మందగించినా మనం మన రోజువారి కార్యకలాపాల కొరకు కూడా ఇతరులపై ఆధారపడాల్సి వస్తుందని హెచ్చరించారు. పెద్ద వయసు వారిలో ముఖ్యంగా రెండు సమస్యలు చూస్తుంటాయని అందులో ఒకటి శుక్లా ఈ సమస్య వయసు మీద పడిన వారికి సహజంగా వస్తుందన్నారు. శస్త్ర చికిత్స ద్వారా కంటిలో అద్దాలను అమర్చి కంటి చూపు మంచిగా ఉండేలా అధునాతనమైన వైద్య విధానాలు ఇప్పుడు అందుబాటులో ఉన్నాయన్నారు.

చిన్నారి మేధావికి అంబేడ్కర్ స్మారక అవార్డు

తెనాలి: రూరల్ మండలం గుడివాడకు చెందిన చిన్నారి మేధావి బండికళ్ల ప్రదీప్‌నారాయణకు మరో గౌరవం దక్కింది. ఇండియన్ న్యూస్ మీడియా కౌన్సిల్ 2025 సంవత్సరానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మెమోరియల్ అవార్డును ప్రకటించింది. మూడేళ్ల వయసు కలిగిన బాలుడు ప్రదీప్‌నారాయణ వివిధ రకాల వస్తువులను 500 వరకు 15 నిమిషాల వ్యవధిలో గుర్తిస్తున్నారు. తన అసాధారణ జ్ఞాపకశక్తిని, గమనికా సామర్థ్యం, నేర్చుకునే ప్రతిభకు గుర్తింపుగా పలు అవార్డులను స్వీకరించాడు. ఈ క్రమంలో తాజాగా ఇండియన్ న్యూస్ మీడియా కౌన్సిల్ ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మెమోరియల్ అవార్డు-2025ను ప్రకటించింది.

పీజీఆర్ఎస్, డయల్ యువర్ కమిషనర్ రద్దు

నెహ్రూనగర్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని సోమవారం నగర పాలక సంస్థలో ప్రతి సోమవారం నిర్వహించనున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్, డయల్ యువర్ కమిషనర్) కార్యక్రమాలను రద్దు చేసినట్లు కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.